సాక్షి
తిరుపతి
సోమవారం | 6 | మార్చి | 2023






బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.53,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.4,700
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.65,000
రిటైల్ వెండి గ్రాము రూ.67

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| తిరుపతి | 36 | 18 |
| చిత్తూరు | 35 | 17 |
| తిరుమల | 31 | 14 |
| గూడూరు | 35 | 20 |
| నగరి | 36 | 18 |



## హైబ్రిడ్ రకం..ఆదాయం ఘనం!

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో హైబ్రిడ్ కూరగాయలు రైతులకు లాభాలను తెచ్చిపెడుతున్నాయి. నాజూకైన, రకరకాల సైజుల్లో అందుబాటులోకి వస్తున్నాయి. - 8లో

## న్యూస్‌రీల్

### తిరుపతికి 'వందేభారత్'



వందేభారత్ ఎక్స్‌ప్రెస్

**తిరుపతి అర్బన్:** ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి త్వరలోనే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడిపేందుకు రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. అత్యంత వేగంతో నడిచే ఈ రైలు అందుబాటులోకి వస్తే కేవలం 6 గంటల్లోనే ప్రయాణికులు సికింద్రాబాద్‌కు చేరుకునే వెసులుబాటు వస్తుంది. అయితే తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ఏ మార్గంలో రైలు నడపాలి, ఏ స్టేషన్లలో స్టాపింగ్ ఇవ్వాలని, టికెట్ ధర ఎంత నిర్ణయించాలి అనే అంశాలపై రైల్వే అధికారులు చర్చిస్తున్నారు.

### తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

**తిరుపతి అర్బన్:** తిరుపతి నుంచి తిరుణ్ణామలైకు సోమవారం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు తెలిపారు. భక్తుల రద్దీ నేపథ్యంలో దయం 6 నుంచి గంటకు ఓ సర్వీస్ చొప్పున ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

### జగనన్న వెంటే మేమంతా..

- డీఎస్సీ-1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు



మాట్లాడుతున్న డీఎస్సీ అభ్యర్థులు

**నాయుడుపేటటౌన్ :** పాతికేళ్ల కలను సాకారం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటే నడుస్తామని డీఎస్సీ-1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని చిన్నదర్గా వద్ద వారు విలేకర్లతో మాట్లాడారు. ఎంటీఎస్ విధానంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించేందుకు కేబినెట్‌లో ఆమోదించిన జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకే మద్దతుగా నిలుస్తామని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మొదటి ప్రాధ్యానత ఓటేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీఎస్సీ అభ్యర్థులు సంచి వీరాస్వామి, సీహెచ్ కృష్ణారెడ్డి, మురారిశెట్టి, మురళి, ఓట్టురు రవీంద్రయాదవ్, మధుబాబు, సీహెచ్ వెంకటేశ్వర్లు, బి.భాస్కర్ పాల్గొన్నారు.

### నేటి స్పందన రద్దు

**తిరుపతి అర్బన్:** తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత తిరిగి 27వ తేదీ నుంచి యథావిధిగా స్పందన కార్యక్రమం ఉంటుందని వారు పేర్కొన్నారు.

### బోయకొండలో భక్తుల రద్దీ

**చౌడేపల్లి:** బోయకొండ గంగమ్మ ఆలయానికి ఆదివారం అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# కొత్త రకం వరిస్తోంది

వినూత్న విధానాలతో ముందడుగు వేస్తే.. భవిష్యత్ అవసరాలను సకాలంలో గుర్తిస్తే.. కొత్త వంగడాలతో ఒనగూరే ప్రయోజనాలను అందిపుచ్చుకుంటే.. ఆధునిక సమాజంలోని ఆహారపు అలవాట్లలో మార్పులను నిశితంగా గమనిస్తే.. మార్కెట్ డిమాండ్ మేరకు పంటల సాగు చేపడితే.. దిగుబడి తగ్గట్టు ధరలను ముందస్తుగా పసిగడితే.. వ్యవసాయం పండుగలా మారుతుంది.. అన్నదాతకు ఆశించిన ఆదాయం దక్కుతుంది.. ఇదే మార్గంలో జిల్లాలోని రైతాంగం పయనిస్తోంది. నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఆర్‌ఎన్‌ఆర్ రకం వరిని అధికంగా సాగు చేస్తోంది. సేద్యాన్ని మరింత లాభసాటిగా మార్చుకుంటోంది.

- 'ఆర్‌ఎన్‌ఆర్' ధాన్యానికి అధిక డిమాండ్
- ఎకరాకు 40 బస్తాల దిగుబడి
- బస్తాకు రూ.1,750 నుంచి రూ.1,800 పలుకుతున్న ధర
- పెద్దసంఖ్యలో మొగ్గుచూపుతున్న రైతులు

శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలో సాగు చేసిన ఆర్‌ఎన్‌ఆర్15048 రకం వరి



తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామంలో వ్యాపారులు కొనుగోలు చేస్తున్న ఆర్‌ఎన్‌ఆర్ పంట



**తిరుపతి అర్బన్ :** జిల్లాలోని రైతులు కొత్తరకం వరి వంగడంతో సాగు చేసి అధిక ఆదాయం పొందుతున్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆర్‌ఎన్‌ఆర్ 15048 (షుగర్‌లెస్) రకంపై ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. ఆరోగ్యానికి మేలు చేకూర్చే ధాన్యం కావడంతో వినియోదారులు సైతం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**పొలం వద్దనే కొనుగోళ్లు**

ఆర్‌ఎన్‌ఆర్15048 రకం ధాన్యాన్ని వ్యాపారులు పొలాల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. తడి ధాన్యం అయితే 80 కేజీలు రూ.1750, ఆరబెట్టింది అయితే 80 కేజీలు రూ.1800 వరకు ధర పలుకుతోంది. పంటను ఒబిడి చేయకముందే రేట్లు మాట్లాడుకుంటున్నారు. మరోవైపు ఈ రకం ధాన్యం ఎకరానికి 40 బస్తాలకు తగ్గకుండా దిగుబడి వస్తోంది. దీంతో రైతులకు ఎకరానికి రూ.70వేల వరకు రాబడి ఉంటోంది. రూ.30వేలు పెట్టుబడి కింద తీసేసినా, రూ.40వేల ఆదాయం మిగులుతోంది. దీనికితోడు ధాన్యం విక్రయించిన వెంటనే వ్యాపారులు డబ్బులు చెల్లించేస్తున్నారు. ఇతర రకాల ధాన్యానికి గతంలో పోల్చుకుంటే బస్తాకు రూ.200 అధిక రేటు వస్తున్నా, ఆర్‌ఎన్‌ఆర్15048తో పోల్చుకుంటే తక్కువగానే వస్తోంది.



ఏర్పేడు మండలం పల్లం గ్రామంలో ఆర్‌ఎన్‌ఆర్ రకం పంట కోస్తున్న మిషన్



రేణిగుంట మండలం అంజిమేడులో ఆర్‌ఎన్‌ఆర్ రకం వరి గడ్డి

**దశాబ్దం వరకు ఇదే జోరు!**

ఒక్కో రకం వరి పంటకు సాధారణంగా పదేళ్లపాటు డిమాండ్ ఉంటుంది. తర్వాత క్రమేణా మార్కెట్ తగ్గిపోతుంది. 1990 నుంచి 2000 సంవత్సరం వరకు ఎక్కువ మంది రైతులు ఏడీటీ 37 రకం వరినే సాగు చేసేవారు. వ్యాపారులు కూడా రైతుల వెంట పడి పంటను కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ఆ రకం దాదాపు కనుమరుగైంది. తర్వాత 2010 సంవత్సరం వరకు ఎస్‌ఎల్‌ఆర్34449 రకం వరికి భలే డిమాండ్ ఉండేది. 2010-21 వరకు బీపీటీ 5204 రకం రాజ్యమేలింది. అయితే 2022 నుంచి ఆర్‌ఎస్‌ఆర్ 15048 రకం వరి పంట హవా మొదలైంది. మరో దశాబ్దం పాటు ఈ పంట జోరే కొనసాగుతుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఈ వరి గడ్డికి సైతం మంచి రేటు వస్తోంది. పశువులు ఇష్టంగా తినడమే కాకుండా పాల దిగుబడి కూడా పెరుగుతుండడంతో మరింత మంది ఈ గ్రాసం కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. రాబోయే కాలంలో ఆర్‌ఎస్‌ఆర్ రకం పంట సాగు చేసి ఆదాయ మార్గంలో పయనించాలని వ్యవసాయశాఖ అధికారులు సైతం సూచనలిస్తున్నారు.

**జిల్లాలో వరి రకాల సాగు**

| ఆర్‌ఎస్‌ఆర్ | - | లక్ష ఎకరాలు |
|---|---|---|
| బీపీటీ 5204 | - | 28,456 |
| ఎస్‌ఎల్‌ఆర్ 34449 | - | 23,078 |
| కేఎస్‌ఎం 1638 | - | 16,975 |
| ఎంటీయూ1262 | - | 13,509 |
| ఎంటీయూ1271 | - | 9,871 |
| ఎంటీయూ1226 | - | 7,678 |
| ఇతర రకాలు | - | 7240 |
| మొత్తం | - | 2,06,807 ఎకరాలు |

**పొలం వద్దే కొంటున్నారు**



ఆర్‌ఎస్‌ఆర్ రకాన్నే ఎక్కువ మంది సాగు చేస్తున్నాం. మంచి దిగుబడి పొందుతున్నాం. పెట్టుబడి పోను ఆదాయం వస్తోంది. అలాగే పంట అమ్ముకునేందుకు పడిగాపులు కాయాల్సిన దుస్థితి తప్పింది. వ్యాపారులే పంట కొనుగోలు చేసేందుకు పొలాల వద్ద ఎదురుచూస్తున్నారు. మారుతున్న కాలాన్ని బట్టి రైతులు ముందుకు సాగితే లాభాలు అందుకోవచ్చు.

– వెంకటయ్య, రైతు, చోడవరం

**అవగాహన కల్పిస్తున్నాం**



ఆర్‌ఎస్‌ఆర్ రకం సాగుతో చక్కటి ఆదాయం వస్తోంది. అందుకే ఈ రకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. షుగర్‌లెస్ కావడంతో ఎక్కువ మంది ఈ ధాన్యం కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో మంచి రేట్లు ఉన్నాయి. ఈ మేరకు భూసార పరీక్షలు చేయించి, పంటలు మార్పు చేసుకునేలా చర్యలు చేపడుతున్నాం. – ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

**దేవేరులతో దేవదేవుడు**





తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. ఆదివారం మూడోరోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామివారు తెప్పలపై కొలువుదీరారు. అశేష భక్తజనుల గోవిందనామస్మరణల నడుమ పుష్కరిణిలో జల విహారం చేస్తూ కటాక్షించారు. – తిరుమల

## త్వరలో ఎంపీటీసీ ఎన్నికలు

**చిత్తూరు కార్పొరేషన్:** జిల్లాలో ఖాళీగా ఉన్న ఐదు ఎంపీటీసీ స్థానాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. రామకుప్పం మండలంలోని మనీంద్రం, వి.కోటలోని ఎస్.బండపల్లె, పూతలపట్టు-1, యాదమరి, ఎస్‌ఆర్ పురం మండలంలో పిళ్లారికుప్పం ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల వివరాలను సోమవారం ప్రకటించనున్నట్లు వెల్లడించారు. అభ్యంతరాలు ఉంటే మంగళవారంలోపు తెలపాలన్నారు. వాటిపై ఈనెల 9వ తేదీలోపు పరిష్కరించి, 10న పోలింగ్ స్టేషన్ల జాబితాను అందజేసి ఆమోదం పొందిన తర్వాత తుది జాబితా ప్రకటించాలని ఎన్నికల సంఘం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొందని వివరించారు. ఇదివరకే ఆయా ఎంపీటీసీ స్థానాల పరిధిలో ఓటర్ల జాబితాను ప్రకటించినట్టు జెడ్పీ సీఈఓ పేర్కొన్నారు.

## రైతులను వేధిస్తే తీవ్ర పరిణామాలు

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**కేవీబీపురం :** రైతులను వేధిస్తే ఎంతటి వారైనా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఓళ్లూరుకు చెందిన దళిత రైతులు తమను గ్రామంలోని ఓ టీడీపీ నేత తప్పుడు కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. తమ పొలాల ఆక్రమించుకుంటే అడ్డుకున్నామని కక్షగట్టి వేధిస్తున్నట్లు వాపోయారు. టీడీపీ వారికి కొందరు అధికారులు కూడా సహకరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. శ్రీకాళహస్తి ఆర్‌డీఓకు ఫోన్ చేసి త్వరితగతిన భూసర్వే చేపట్టి దళిత రైతుల సమస్య పరిష్కరించాలని కోరారు. తప్పుడు ఫిర్యాదులతో రైతులను ఇబ్బందిపెడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వెంటనే గ్రామంలో విచారించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్‌ఐ సునీల్‌ను ఆదేశించారు. ఆర్‌డీఓను కలిసి విషయాన్ని సమగ్రంగా తెలియజేయాలని బాధిత రైతులకు సూచించారు.



ఎమ్మెల్యే ఆదిమూలానికి సమస్య వివరిస్తున్న రైతులు

## జిల్లాకు చేరిన బ్యాలెట్ పేపర్లు

**చిత్తూరు కలెక్టరేట్ :** ఉమ్మడి ప్రకాశం- నెల్లూరు-చిత్తూరు జిల్లా పట్టభద్రుల, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల మొదటి దశ బ్యాలెట్ పేపర్లు ఆదివారం జిల్లా కేంద్రానికి చేరాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వాటిని పకడ్బందీ బందోబస్తు నడుమ జిల్లాకు పంపింది. వాటిలో ప్రకాశంకు సంబంధించిన వాటిని పకడ్బందీ బందోబస్తుతో ఆ జిల్లాకు పంపారు. మిగిలిన బ్యాలెట్ పేపర్లు కలెక్టరేట్‌లోని ట్రెజరీ కార్యాలయ స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. రెండో దశలో సోమవారం జిల్లాకు విచ్చేసే బ్యాలెట్ పేపర్లను నెల్లూరు, చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు పంపిణీ చేసేలా కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియను జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పర్యవేక్షించారు.

## శ్రీసిటీకి పెట్టుబడుల వెల్లువ



శ్రీసిటీలో పరిశ్రమలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



వివిధ కంపెనీలతో ఎంఓయూ కుదుర్చుకుంటున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుడివాడ అమర్‌నాథ్

- విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌లో రూ.7,075 కోట్లకు ఒప్పందాలు

**వరదయ్యపాళెం:** విశాఖపట్నంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్-2023లో శ్రీసిటీకి పెట్టుబడులు వెల్లువెత్తాయి. సుమారు రూ.7,075 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు, వర్చువల్ ప్రారంభోత్సవాలు జరిగాయి.అందులో ఇప్పటికే ఉన్న 14 పరిశ్రమలకు సంబంధించి ప్లాంట్ల విస్తరణ కాగా, 5 కొత్త కంపెనీల ప్రతిపాదనలు ఉన్నాయి. విశాఖ పెట్టుబడుల సదస్సు వేదిక నుంచి కేంద్ర పర్యాటక సాంస్కృతికశాఖ మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 14 పరిశ్రమలను వర్చువల్‌గా ప్రారంభించగా, అందులో శ్రీసిటీకి సంబంధించి 7 కంపెనీలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఒప్పంద పత్రాల మార్పిడిలో రాష్ట్ర ఇంధనం, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమరనాథ్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఎంఓయూలపై రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణాన్ని సృష్టించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనీయులన్నారు. ఆయన ప్రోత్సాహం మార్గదర్శకత్వంలో, శ్రీసిటీ అత్యంత ప్రాధాన్య పెట్టుబడి గమ్యస్థానాలలో ఒకటిగా ఆవిర్భవించిందని వెల్లడించారు. కాగా, శ్రీసిటీకి సంబంధించి వర్చువల్ ప్రారంభోత్సవాలు జరిగిన పరిశ్రమల్లో కింబర్లీ క్లార్క్, బ్లూస్టార్ ఉన్నాయి. నిర్మాణంలో ఉన్న డైకిన్ పరిశ్రమ స్కిల్ డెవలప్‌మెంట్‌లో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఇతర పెట్టుబడులు పెట్టనున్న జపాన్, యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దక్షిణ కొరియా, జర్మనీతోపాటు మనదేశానికి చెందిన పలు కంపెనీలు లైట్ ఇంజినీరింగ్, ఫార్ములేషన్స్, టెక్స్‌టైల్స్, ఎఫ్‌ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ తదితర రంగాలలో పెట్టుబడి ప్రతిపాదనలు తీసుకువచ్చాయి. మొత్తం ఒప్పందాల ద్వారా 1,7500 ఉద్యోగాలు వస్తాయని అధికారులు అంచనా వేశారు.

## పవిత్రం.. లక్ష్మీ గణపతి హవనం

- విశాఖ శారద పీఠాధిపతులు
- మూడు రోజుల హోమ పూజలు పరిసమాప్తం
- కాణిపాకంలో ఆధ్యాత్మిక సందడి



పీఠాధిపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ

**కాణిపాకం(యాదమరి):** లక్షమోదక లక్ష్మీగణపతి హవనంతో కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం ఎంతో పవిత్రతను సంతరించుకుందని విశాఖ శారద పీఠాధిపతులు శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తరాధికారి శ్రీస్వాత్మానందేంద్ర సరస్వతిస్వామి తెలిపారు. ఆలయంలోని కల్యాణ వేదికలో స్వాముల చేతుల మీదుగా మూడో రోజు ఆదివారం కూడా ఉదయం, సాయంత్రం హవన పూజలు నిర్వహించారు. ఉదయం గో పూజ చేసి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. మహాస్వామి మాట్లాడుతూ ఈ హోమం ఇప్పటి వరకు ఏ దేవాలయంలో నిర్వహించలేదని, కాణిపాకం ఆలయంతో పాటు దేశ సుభిక్షతకు తోడ్పడుతుందన్నారు. భక్తులకు లక్ష్మీ గణపతి హవనం విశిష్టతను వివరించారు. ఈక్రతువుకు సంబంధించిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. హోమంలో ఉంచిన పవిత్ర కలశ జలాలను ఆలయం చుట్టు ఊరేగించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, అధికారులు పాల్గొన్నారు.

**స్వామివారి సేవలో ప్రముఖులు**

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, తిరుపతి ఎంపీ గురుమూర్తి, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వారు హోమ పూజల్లో పాల్గొన్నారు.



లక్షమోదక లక్ష్మీగణపతి హవనం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న విశాఖ శారద పీఠాధిపతులు

**బిందుతీర్థం తీర్థంకు ప్రత్యేక పూజలు**

స్వామివారికి సుప్రభాత సేవలో ఉపయోగించే బిందు తీర్థానికి శ్రీస్వాత్మా నందేంద్ర సరస్వతి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్కరిణిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ జలాలను తీసుకొచ్చి అభిషేకాలు నిర్వహించారు. భక్తులతో ఆలయం రద్దీగా మారింది. పూజలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

**పీఆర్‌ఓ కార్యాలయం ప్రారంభం**

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద పీఆర్‌ఓ కార్యాలయాన్ని శ్రీస్వరూపానందేంద్ర స్వామి ప్రారంభించారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

చిల్లకూరు : మండలంలోని కడివేడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.1,500 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గోపాల్ తెలిపారు. దాడిలో కానిస్టేబుళ్లు భాస్కర్, నరేష్, విష్ణు, రామచంద్రయ్య, పెంచల్‌రెడ్డి పాల్గొన్నారు.

## 62 మందికి జరిమానా


విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ భాస్కర్ రెడ్డి

తిరుపతి క్రైమ్: నగరంలో ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘించిన 62 మందికి జరిమానా విధించినట్లు సీఐ భాస్కర్ రెడ్డి తెలిపారు. నగరంలో ఆదివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో 35 మంది ట్రిపుల్ రైడింగ్, 18 మంది మైనర్లు, తొమ్మిది మంది నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, మొత్తం 62 మందిని గుర్తించామన్నారు. వారి తల్లిదండ్రులు కౌన్సెలింగ్ నిర్వహించి, జరిమానా విధించినట్లు వెల్లడించారు.






కల్లుపల్లె వద్ద హైబ్రిడ్ టమోట సాగు


మునగ తోట


మొరం పంచాయతీలో మస్క్‌మిలాన్


# హైబ్రిడ్ రకం..
# ఆదాయం ఘనం!

- హైబ్రిడ్ కూరగాయల సాగులో రైతులు
- కొత్త వంగడాల పండ్లు సైతం..
- కర్ణాటక రైతుల బాటలో పలమనేరు రైతులు
- తోటల వద్దే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

**పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో హైబ్రిడ్ కూరగాయలు, పండ్ల సాగు రైతులకు లాభాలను తెచ్చిపెడుతోంది. నాజూకైన, నాణ్యతతో రకరకాల సైజుల్లో ఇవి పండుతూ అధిక దిగుబడులు వస్తుండడంతో వీటి సాగుపై రైతాంగం దృష్టిసారిస్తోంది. హైబ్రిడ్ పంటల సాగులో ముందంజలో ఉన్న కర్ణాటకలోని కోలారు, మాలూరు, బెంగళూరు రూరల్ జిల్లాలకు సమీపంలో ఉండడం ఇక్కడి అన్నదాతలకు మరింత అవకాశంగా మారింది. అక్కడి రైతుల అనుభవాలను ప్రత్యక్షంగా తెలుసుకుని లాభాలు పొందే వెసులుబాటు వచ్చింది.**


తొప్పనపల్లె వద్ద ఎర్ర కర్బూజా పంట


కర్బూజా


చేతికందేలా కొబ్బరికాయలు

పలమనేరు: సంప్రదాయ నాటు రకాలకు స్వస్తి పలికి హైబ్రిడ్ కూరగాయల, పండ్ల సాగుపై పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లోని రైతులు మక్కువ చూపుతున్నారు. హైబ్రిడ్ రకాలైన టమాట, కాకర, బీర, క్యాబేజీ, బేబీకార్న్, స్వీట్‌కార్న్, ఫెన్సిల్ బీన్సు, జెలపినో మిరప( క్యాప్సికం), కాలిఫ్లవర్, రెడ్‌లేడీ బొప్పాయ, అరటి, కర్బూజా, క్యారెట్, ఎర్ర ముల్లంగి, దోస, మస్క్‌మిలాన్, చేతికందే మునగ, వంగ, ఎర్రబెండకాయలు, ఎల్లో కర్బూజ ఇలా రకరకాల కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. కల్లుపల్లి, ఉయ్యాలమిట్ట, మొరం, కల్లాడు, చెన్నుపల్లి, కలగటూరు, మారేడుపల్లి, పాతూరునత్తం, నక్కపల్లి, కన్నమాకులపల్లితో పాటు పెద్దపంజాణి, వీకోట, బైరెడ్డిపల్లి, శాంతిపురం మండలాల్లో ఈపంటల సాగు ఎక్కువగా ఉంది.

**చెట్టెక్కాల్సిన పని లేదు**

ఇప్పటి వరకు కొబ్బరిబొండాం కోసం చెట్టు ఎక్కాల్సిందే. కాని హైబ్రిడ్ రకాల్లో నిలబడి కాయలను కోసుకోవచ్చు. కొలమాసనపల్లె సమీపంలో ఓ రైతు వీటిని సాగుచేశాడు. జామ కాయల కోసం చెట్లు ఎక్కాల్సిన పనిలేదు. తైవాన్ జామ, వీఎన్‌ఆర్ బిహి రకం జామ చెట్లు కేవలం మూడు నుంచి ఐదుడుగులే. ఓ జామకాయ బరువు నాలుగునుంచి ఆరు కిలోలు ఉంటుంది. గంగవరం మండలంలోని కల్లుపల్లి వద్ద దేవేంద్రనాయుడు, ఉయ్యాలమిట్ల వద్ద బాబునాయడు ఈ హైబ్రిడ్ జామతోటలను పెంచారు. పొట్టిరకం మామిడిని సైతం ఈ ప్రాంతంలోని కొందరు రైతులు వినూత్నంగా సాగు చేస్తున్నారు.

**కర్ణాటక రైతులే ఆదర్శం**

పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాలకు ఆనుకుని ఉన్న కర్ణాటక ప్రాంతంలోని రైతులు 15 రకాల కూరగాయలు, ఏడు రకాల పండ్ల తోటలను పూర్తిగా హైబ్రిడ్ రకాలతో నాలుగైదేళ్లుగా సాగుచేస్తున్నారు. వీరి సాగు, అక్కడి రైతుల అనుభవాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ ఇక్కడి రైతులు స్థానికంగా ఈ పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

**మంచి మార్కెటింగ్ సౌకర్యం...**

పలమనేరు నుంచి బెంగళూరు, చెన్నై, విజయవాడ, హైదరాబాద్, సేలం, మంగళూరు ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ బాగుంది. ఇక్కడ మూడు జాతీయ రహదారులుండడంతో ట్రాన్స్‌ఫోర్ట్‌కు అనుకూలంగా మారింది. కర్ణాటకతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులకు ఇక్కడి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి పండించే హైబ్రిడ్ బొప్పాయిని ఢిల్లీ వ్యాపారులు తోటలవద్దే కొంటున్నారు.

**అందుబాటులో సీడ్స్**

హైబ్రిడ్ రకాల కూరగాయలు, పండ్లుకు సంబంధించి దేశీయ, విదేశీ సీడ్స్ కంపెనీల సీడ్స్, కొత్త వంగడాలు అందుబాటులో ఉన్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టీకల్చర్ అండ్ రీసెర్చ్ ద్వారా కుప్పం సమీపంలోని పెద్దబంగారునత్తంలో సెంటర్‌ఫర్ ఎక్సెలెన్స్‌ఫర్ విజిటబుల్స్‌లో కొత్త వంగడాలపై ప్రయోగాలు చేసి సృష్టిస్తున్నారు. వీటిని ఇక్కడి రైతులకు పంపిణీ చేసి ప్రయోగాత్మకంగా సాగు చేయిస్తున్నారు.


దోస



ఎర్రబెండ


తైవాన్ బిహి (జామ)


బొప్పాయి



**హైబ్రిడ్ రకాలను సాగుచేస్తున్నా..**

కొన్నేళ్లుగా హైబ్రిడ్ రకాలను సాగుచేస్తున్నాను. మస్క్‌మిలాన్, కోహినూర్ ఎల్లో కర్బూజ, మెడిసిన్ దోస, గుమ్మడి లాంటి పంటలను ఎక్కువగా చేస్తున్నాను. నాలుగైదు రాష్ట్రాల్లో మార్కెటింగ్ చేస్తుంటా. కొత్త వెరైటీ కావాలంటే ఆ కంపెనీకి చెందిన మార్కెటింగ్ ప్రతినిధులను సంప్రదిస్తే చాలు. వారే సీడ్స్‌ను ఇచ్చి సాగు అనుమానాలను నివృత్తి చేస్తుంటారు.

– మస్క్‌మిలాన్ గజేంద్ర, తొప్పనపల్లె



**పలు రకాల వంగడాలు**

దేశీయ కంపెనీలతో పాటు అంతర్జాతీయ సీడ్స్ కంపెనీల సీడ్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రాంత వాతారవరణం అన్ని రకాల కూరగాయల పంటల సాగుకు అనుకూలంగా ఉంది. రైతులకు నూతన వంగడాల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తిగల రైతులకు అవరసమైన సలహాలు, సూచనలిస్తున్నాం. కుప్పంలోని సెంటర్‌ఫర్ ఎక్స్‌లెన్స్‌లో పలు రకాల కొత్తవంగడాలను రూపొందిస్తున్నాం.

– డాక్టర్ కోటేశ్వరావు, హార్టీకల్చర్ ఏడీ, పలమనేరు



## యువకుల ఘర్షణ.. పరస్పర దాడులు

కేవీబీపురం: ఇద్దరు యువకులు ఘర్షణ పడి, పరస్పరం దాడులకు దిగడంతో కత్తిపోట్ల వరకు దారి తీసిన ఘటన కేవీబీపురం మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాగిగుంట గ్రామానికి చెందిన బొబ్బిలి శ్యామ్ అనే యువకుడు స్థానికంగా కూల్‌డ్రింక్ షాపు నడుపుతున్నాడు. ఆ షాపులో మద్యం విక్రయిస్తున్నారని ఢిల్లీ బాబు (23) అనే యువకుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడన్న సందేహంతో శ్యామ్, ఢిల్లీబాబు బాబాయ్‌తో వాగ్వావాదానికి దిగాడు. దీంతో ఢిల్లీబాబు జోక్యం చేసుకుని శ్యామ్‌ని ఇనుపచువ్వతో వీపుపై పొడిచి గాయపరిచాడు. దీంతో శ్యామ్ ఇంటికెళ్లి కత్తి తీసుకొచ్చి ఢిల్లీబాబుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన ఇద్దరు యువకల్ని కుటుంబసభ్యులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు రంగ్గ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. విచారించి కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ సునీల్ తెలిపారు. ఢిల్లీబాబును మెరుగైన వైద్యం కోసం తిరుపతికి సిఫారసు చేశారు.

## కిలకిల రావాలు.. పిల్లల కేరింతలు




గూడబాతు, తెడ్డుముక్కుకొంగ, పెద్ద నీటికాకి పిల్ల

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి పక్షి ప్రేమికులు క్యూ కడుతున్నారు. విదేశీ విహంగాల విన్యాసాలు పర్యాటకుల విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఎగురుతున్న పక్షులు.. విడిది చేసే చెట్లు, పక్షుల గూళ్లతో సెల్ఫీలు దిగి మురిసిపోతున్నారు. సీజన్ వచ్చే నెలతో ముగియనున్న నేపథ్యంలో ఆదివారం చెన్నై, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పిల్లల పార్కు ఆటపాటలతో నిండిపోయింది. - దొరవారిసత్రం


విహంగాల వీక్షణలో పర్యాటకులు


పార్కులో పిల్లల ఆటపాటలు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్టు సీఐ శ్రీహరి తెలిపారు. సూళ్లూరుపేటకు చెందిన వినోద్(46), శ్రీనివాసులు (43) ద్విచక్ర వాహనంపై తిరుపతికి బయలుదేరారు. సీతారాంపేట వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో అదుపుతప్పి కింద పడ్డారు. గాయపడిన వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కోడిపందేల స్థావరంపై దాడి : 15 మంది అరెస్ట్


అదుపులోకి తీసుకున్న నిందితులతో పోలీసులు

నాయుడుపేటటౌన్ : మండలంలోని మాబాక గ్రామం వద్ద నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. కొందరు పందెంరాయుళ్లు పరారవగా, 15 మందిని అదుపులోకి తీసుకుని రూ.33వేల నగదు, 30 బైక్‌లు, 8 కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారితోపాటు, పరారైనవారిపై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ రావు తెలిపారు.

## ఎమరాల్డ్స్ టాలెంట్ టెస్ట్‌కు అనూహ్య స్పందన


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమరాల్డ్స్ విద్యాసంస్థల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఎమరాల్డ్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు అనూహ్య స్పందన లభించినట్లు ఆ సంస్థ డైరెక్టర్లు ఇ.గిరిధర్‌రెడ్డి, కె.విశ్వనాథరెడ్డి తెలిపారు. సుమారు 600కు మందికిపైగా పదో తరగతి విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఇందులో రత్నం స్కూల్‌కు చెందిన పి.నాగసుమ మొదటి ర్యాంకు సాధించి రూ.10 వేలు గెలుపొందిందన్నారు. అలాగే గౌతం స్కూల్‌కు చెందిన కె.భావన రెండో ర్యాంకు, జేసీఆర్ చైతన్య స్కూల్‌కు చెందిన సి.యశ్వంత్‌రెడ్డి మూడో ర్యాంకు సాధించి రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమరాల్డ్స్ విద్యాసంస్థల డైరెక్టర్లతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు ఎస్.మునిరత్నం, టి.శ్రీనివాసులు ఎస్.జానకిరామ్, ఎ.పార్థసారథి, టి.నాదముని పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు


ఆలయం వెలుపల జస్టిస్ విక్రమ్‌నాథ్

తిరుమల: పలువురు ప్రముఖులు తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. వీరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కేశినేని నాని ఉన్నారు.

**సర్వ దర్శనానికి 24 గంటలు**

తిరుమల క్యూ కాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 77,522 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.66 కోట్లు వేశారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టికెట్లు లేనివారికి 24 గంటల్లో, ఎస్ఈడీ టికెట్లు ఉన్న వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.


జస్టిస్ దుప్పల వెంకటరమణ


జస్టిస్ సూర్యపల్లినంద


ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

## హోరాహోరీగా అంతర కళాశాలల క్రీడలు


కబడ్డీ పోటీలో తలపడుతున్న అన్నమాచార్య కడప, ఎస్వీ కాలేజ్ తిరుపతి జట్లు


బాస్కెట్‌బాల్ పోటీలో ఆర్‌జీఎం నంద్యాల, రాజంపేట జట్లు

గూడూరురూరల్ : స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ అనంతపురం 11వ అంతర కళాశాలల క్రీడలు రెండోరోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జట్లు తలపడ్డాయి. ప్రిన్సిపల్ ధనుంజయ మాట్లాడుతూ 48 కళాశాలలకు చెందిన 1,500 మంది విద్యార్థిని, విద్యార్థులు 9 క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు హాజరయ్యారన్నారు. పోటీలకు ఆదిశంకర కళాశాల 4వ పర్యాయం ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. సోమవారంతో పోటీలు ముగుస్తాయని, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ మోహన్, పీడీ రవి చంద్ర, ఏఓ రామయ్య పాల్గొన్నారు. టేబుల్ టెన్నిస్ సింగిల్స్ బాలికల విభాగంలో నారాయణ కళాశాల నెల్లూరు విజేతగా నిలవడం విశేషం.

**ఫైనల్స్, సెమీస్, క్వార్టర్స్ జట్లు ఇవే..**

షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఆదిశంకర, ఎన్‌బీకేఆర్ విద్యానగర్ జట్లు ఫైనల్స్‌కు చేరాయి.అలాగే టేబుల్ టెన్నిస్ డబుల్స్ బాలుర విభాగంలో ఎన్‌బీకేఆర్, జేఎన్‌టీయు అనంతపురం జట్లు, బాలికల విభాగంలో ఎన్‌బీకేఆర్, జేఎన్‌టీయు అనంతపురం జట్లు ఫైనల్స్‌లో తలపడనున్నాయి.బాస్కెట్ బాల్ బాలికల విభాగంలో ఎన్‌బీకేఆర్ విద్యానగర్, జేఎన్‌టీయు అనంతపురం, ఆర్‌జీఎం నంద్యాల, ఏఐటీఎస్ రాజంపేట జట్లు సెమీస్‌కు చేరాయి. బాలుర విభాగంలో జేఎన్‌టీయు అనంతపురం, ఎంఐటీఎస్ మదనపల్లె సెమీస్‌కు వెళ్లాయి. కబడ్డీ పోటీలో శ్రీవిద్యానికేతన్, ఎస్‌వీసీఈ నెల్లూరు జట్లు క్వార్టర్స్‌కు చేరాయి. అలాగే బాల్ బ్యాడ్మింటన్ బాలికల విభాగంలో జేఎన్‌టీయుఏ, పులివెందుల, ఎన్‌బీకేఆర్ జట్లు ఫైనల్స్‌లో తలపడనున్నాయి.